క్లుప్తంగా

దళితరత్న అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న వెంకటేష్

లక్సెట్టిపేట: మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి వెంకటేష్ దళితరత్న అవార్డు అందుకున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాబూజగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా సేవలందించిన వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అవార్డులను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ అవార్డును మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా గురువారం హైదరాబాద్‌లో అందజేసినట్లు పేర్కొన్నారు. దళిత సంఘాల అభివృద్ధికి సంక్షేమ పథకాలను తెలియపర్చి ముందుకు తీసుకువెళ్లినందుకు అవార్డు లభించిందన్నారు.

బలగం సినిమాకు బంపర్ ఆఫర్

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్వీసీ జెమినీ థియేటర్ యాజమాన్యం బలగం సినిమా చూడాలనే ప్రేక్షకులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. విడిపోయిన కుటుంబాలను కలుపుతున్న బలగం సినిమా ఈ నెల 21న 50 రోజులు పూర్తి చేసుకుంటున్న తరుణంలో శుక్రవారం మ్యాటీ షోకు (1.15 గంటలకు) ఒక టికెట్ కొనుగోలు చేస్తే మరో టికెట్ ఉచితంగా ఇవ్వనున్నట్లు థియేటర్ మేనేజర్ మురళీధర్‌రావు ప్రకటించారు. ఈ అవకాశాన్ని ప్రేక్షకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీ సందర్శన



సూచనలు చేస్తున్న ఉప వైద్యాధికారి

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా ఉప వైద్యాధికారిని విజయనిర్మల సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆరోగ్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారి శివప్రతాప్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ప్రమాదకర ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును పరిశీలించిన ఏఈ

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ అధికారులు తొలగించారు. పంచాయితీ కార్యాలయం ఎదుట ఏళ్లుగా ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకంగా ఉండడంతో ‘సాక్షి’ దినపత్రికలో వరుస కథనాలు రావడంతో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం విద్యుత్ శాఖ బెల్లంపల్లి రూరల్ ఏఈ రాంమనోహర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించి గ్రామ శివారులో ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి తడులు అందించాలి



తోటలను పరిశీలిస్తున్న హెచ్‌వో, సీఈవో

వేమనపల్లి: ఎండాకాలం పామ్ ఆయిల్ తోటల సంరక్షణకు నీటి తడులు అందించాలని మ్యాట్రిక్స్ సీఈఓ ఉదయ్‌కుమార్, బెల్లంపల్లి ఉద్యానవనశాఖ అధికారి సుప్రజ తెలిపారు. మండల కేంద్రంతో పాటు బొమ్మెన, గొర్లపల్లి గ్రామాల్లోని పామ్ ఆయిల్ తోటల జియో టాగింగ్‌లో భాగంగా పంటలను పరిశీలించారు. మొక్కల చుట్టు గడ్డి పెరగకుండా చూడాలని తెలిపారు. మచ్చల ఆకులు ఉన్న మొక్కకు బోరాన్ పిచికారీ చేయాలని, యూరియా, పొటాష్‌లతో నీటి తడులు అందజేయాలని సూచించారు. ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంహెచ్‌డీ రాష్ట్ర కార్యదర్శిగా రాజం

బెల్లంపల్లి: బెల్లంపల్లి రడగంబాల బస్తీకి చెందిన కాంపల్లి రాజం మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) రాష్ట్ర కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మాదిగ హక్కుల సాధనలో రాజం తనవంతు పాత్ర పోషించడంతో పాటు మాదిగలను సమీకరించడంలో, సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో కృషి చేయాలని సూచించారు. తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేసిన అది నాయకత్వానికి రాజం కృతజ్ఞతలు తెలిపారు.





కేసీఆర్ పార్క్‌లో.. సందడి

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ నడిబొడ్డున, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కన రూ.2కోట్లతో నిర్మించిన కేసీఆర్ పార్క్‌కు పట్టణ ప్రజలతో పాటు పర్యటకుల తాకిడి పెరిగింది. పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండడంతో విద్యార్థులు, చిన్నారులు పార్క్‌లో సేదతీరుతున్నారు. గతంలో చెన్నూర్‌లో కాలక్షేపం చేసేందుకు ఎలాంటి సౌకర్యం లేకపోవడంతో సెలవు రోజుల్లో సైతం ప్రజలు ఇంటి నుంచి బయటికి వచ్చే వారు కాదు. కేసీఆర్ పార్క్ నిర్మాణంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదంతో పాటు కాలక్షేపానికి కొదువ లేకుండా పోయింది. పట్టణ ప్రజలే కాకుండా పక్కనే ఉన్న కోటపల్లి, వేమనపల్లి, భీమారం మండలాలతో పాటు మహారాష్ట్ర వాసులు సైతం పార్క్ అందాలను ఆస్వాదిస్తున్నారు. మిత్రులు, కుటుంబ సభ్యులతో వచ్చి సెల్ఫీలతో సందడి చేస్తున్నారు.

వీవోఏల వినూత్న నిరసనలు



దండేపల్లి: కళ్లకు గంతలతో వీవోఏల నిరసన

కళ్లకు గంతలతో..

దండేపల్లి: వీవోఏలు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం దండేపల్లిలో రిలే దీక్ష శిబిరంలో కూర్చున వీవోఏలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.

మోకాళ్లపై నిరసన..

చెన్నూర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు చేస్తున్న సమ్మెలో భాగంగా గురువారం మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. స్థానిక ఐకేపీ కార్యాలయం ఎదుట వీవోఏలు చేపట్టిన సమ్మె నాలుగు రోజులకు చేరుకుంది. కార్యక్రమంలో వీఏవోలు నాయకులు గాడిపల్లి సడవలి, రాజ్యలక్ష్మీ, స్వరూప, రజిత, సతీశ్, సత్యం, రమేశ్, జ్యోతి, శంకర్, బాపు, రోషయ్య పాల్గొన్నారు.



భీమారంలో దున్నపోతుకి వినతిపత్రం ఇస్తూ..

మోకాళ్లపై కూర్చొని...

20సీఎస్ఆర్105 కోటపల్లి: మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న ఐకేపీ వీవోఏలు

కోటపల్లి: మండలంలో వీవోఏలు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఇందులో మండల అధ్యక్షుడు సురేష్, కార్యదర్శి రమాదేవి, నిట్టూరి రాజన్న, శుభ్రాబి, కోశాధికారి మహేశ్వరి, ఉపాధ్యక్షుడు నాగన్న, సంపత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల సంఘీభావం..

వేమనపల్లి: వీవోఏల నిరవధిక సమ్మెకు బెల్లంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు నేతరి స్వామి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీ, డీసీసీ మెంబర్ రాంచందర్ పాల్గొన్నారు.

ఐకేపీ ఏపీవో, సీసీల మద్దతు...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల వీవోవోలు చేపట్టిన సమ్మెకు ఐకేపీ ఏపీఓ శ్రీనివాస్‌గౌడ్, సీసీలు మద్దతుగా నిలిచారు.



చెన్నూర్‌లో మోకాళ్ల పై కూర్చొని..



వేమనపల్లి: నగదు అందజేస్తున్న నాయకుడు

దున్నపోతుకి వినతి..

భీమారం: మండలంలో వీవోఏలు దున్నపోతుకి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. అనంతరం మండల బీజేపీ అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ మద్దతు తెలిపారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



తనిఖీలో పాల్గొన్న డీఆర్‌డీవో, ట్రైనీ కలెక్టర్

భీమిని: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 12వ సామాజిక తనిఖీ ప్రజావేదిక గురువారం నిర్వహించారు. 2019 నుంచి 2023 డిసెంబర్ వరకు జరిగిన రూ.7.28 కోట్లుతో వివిధ రకాల పనులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో పది రోజులుగా పది బృందాలతో 15 నుంచి 19వ తేదీ వరకు గ్రామాల్లో ఈజీఎస్ పనులపై డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు, వీఎస్‌లు పనులను తనిఖీ చేసి నివేదికలు రూపొందించారు. గ్రామాల్లో ఈజీఎస్ పనుల్లో పలు అవకతవకలు జరిగాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో డీఆర్డీవో శేషాద్రి పనుల్లో 12 గ్రామపంచాయతీల్లో అవకతవకలు, పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి రూ.24 వేల ఫెనాల్టీ విధించారు. రూ.9,11,122 రికవరీ చేయాలని ఆదేశించారు. డంపింగ్‌యార్డు షెడ్ల నిర్మాణం, ఎవన్యూ ప్లానిటేషన్ తదితర పనుల్లో తేడాలు రావడంతో గ్రామపంచాయతీల నుంచి రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి, జెడ్పీటీసీ పోతురాజుల గంగక్క, ట్రైనీ కలెక్టర్, ఇన్‌చార్జి ఎంపీడీవో గౌతమి, అడిషనల్ పీడీ దత్తరావు, డీఎల్‌పీవో ఫణీందర్ రావు, కన్నెపల్లి ఎంపీడీవో రాధాకిషన్, ఎంపీఓ సబ్దర్‌అలీ, ఏపీఓ భాస్కర్‌రావు, అంబుడ్స్‌మెన్ శివరాం పాల్గొన్నారు.

అణచివేత ధోరణి మానుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జైపూర్: పవర్ ప్లాంటు కాంట్రాక్టు కార్మికులు సమస్యలు పరిష్కారించాలని 11 నెలలుగా కోరుతున్నా స్పందించని యాజమాన్యం ప్లాంటు గేటు ఎదుట శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్మికులను పోలీసుతో అణచివేసే ధోరణి మానుకోవాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పెరం రమేశ్, జనరల్ సెక్రెటరీ దుస్స భాస్కర్ సూచించారు. ఎస్టీపీపీ ప్రధాన గేటు వద్ద బీఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం నిరసనకు పిలుపునివ్వగా, పోలీసులు ముందస్తుగా బీఎంఎస్ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మె నోటీలు ఇచ్చి 11 నెలలు గడిచినా సమస్యల పరిష్కారానికి సంస్థ ముందుకు రావడం లేదన్నారు. బుధవారం డిప్యూటీ సీఎల్‌సీ సమక్షంలో యూనియన్‌కు, యాజమాన్యానికి కన్సోలేషన్ ఏర్పాటు చేయగా కనీసం సంస్థ రాకుండా కార్మికులపై వివక్ష చూపిందన్నారు. నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, అర్హత కలిగిన కార్మికులకు ప్రోమోషన్లు ఇవ్వాలని, ఫ్యాక్టరీ ప్రభావిత గ్రామాల నుంచి బస్సు సౌకర్యం కల్పించి కార్మికులకు రావాణా సౌకర్యం, డస్ట్ అలవెన్స్ రూ.650 ప్రతినెలా చెల్లించాలని, ప్లాంట్ స్పెషల్ అలవెన్స్ కింద నెలకు రూ.2,500 ఇవ్వాలని, సబ్సిడీతో క్యాంటీన్ సౌకర్యం, ప్రతీ కార్మికుడికి మూడు జతల యూనిఫాం, ఐడీ కార్డులు, ప్రమాద బీమా, ఈఎస్ఐ ఆస్పత్రి వంటి సౌకర్యాలు కల్పించాలని వివరించారు. కాగా, బీఎంఎస్ నాయకులను అరెస్టును నిరసిస్తూ ఎస్టీపీపీలో పలు డిపార్టుమెంట్ల వారీగా కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ బీఎంఎస్ అనుబంధ సంఘం అధ్యక్షుడు చినూరి రాజేందర్‌రెడ్డి, కార్యదర్శి ఇప్పలపెల్లి రాజు, కోశాధికారి ఈగ సురేందర్ పాల్గొన్నారు.

నాయకపుగూడలో ఇంద్రవెల్లి అమరులకు నివాళి



నినాదాలు చేస్తున్న నాయకులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ గ్రామపంచాయతీ నాయకపుగూడలో గురువారం ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం ఆధ్వర్యంలో ఇంద్రవెల్లి అమరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం రాష్ట్ర కోశాధికారి కొమ్ముల బాపు మాట్లాడారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీల పోడు భూములకు పట్టాలు ఇచ్చి సమస్యలు పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు రెడ్డి లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోమ్ము రజిత, మేకల సునిల్, బుర్ర మనోజ్, సంద్ర మహేష్, కొమ్ముల సంజీవ్, రమేష్ ఉన్నారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: జన్నారం మండలంలోని కిష్టాపూర్, కొమ్ముగూడెం గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ గురువారం పరామర్శించారు. కిష్టాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తిరుపతి కుమారుడు అబిలాష్ కొద్ది రోజుల క్రితం మృతి చెందగా వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కొమ్ముగూడెంకు చెందిన అజ్మీరా శ్రీనివాస్ మృతి చెందగా ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు రాజారాం రెడ్డి, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, ఏఎంసీ జిల్లా డైరెక్టర్ భరత్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేశ్‌యాదవ్, మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

మందమర్రిలో ఇఫ్తార్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని మార్కెట్ ఏరియా సమీపంలోని మసీదులో ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ మహేందర్ రెడ్డి , ఎస్సై చంద్రకుమార్, బీఆర్ఎస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

జన్నారం: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గురువారం జన్నారం మండల కేంద్రంలో పలు పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఫైర్ అధికారి లక్ష్మీ నారాయణ, సిబ్బంది సంతోష్, శ్రీనివాస్, పవన్, ప్రవీణ్, వేణుగోపాల్, మహెందర్ ఉన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

వేమనపల్లి: మండలంలోని జిల్లెడ గ్రామపంచాయతీ కేంద్రంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కొండాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గణపతి ప్రారంభించారు. మొదటి రోజు 145 మందికి కంటి పరీక్షలు చేయగా 62మందికి కంటి అద్దాలు అందజేశారు. వైద్యాధికారి హారీష్‌ఖాన్, క్యాంపు కో ఆర్డినేటర్ రాంశెట్టి బాపు, ఆప్తాలమిక్ ఆఫీసర్ చైతన్యప్రసాద్, జీపీ కార్యదర్శి హరినాథ్ పాల్గొన్నారు.

30వార్డులో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 30 వార్డులో గురువారం కంటి వెలుగు శిబిరం -2 ప్రారంభమైంది. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కౌన్సెలర్ గెల్లి రాజలింగు, మాజీ కౌన్సెలర్ శంకర్ సింగ్, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మదునం పోచమ్మకు విప్ పూజలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని ఎంఆర్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన కోటపల్లి మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రభుత్వ విప్ బాల్క సుమన్ స్థానిక మదునం పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ మహేశ్ ఉన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

జన్నారం: జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన 14 మంది బాలికలకు ఔ ట్రీస్ మ్యాప్ స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ ఇప్పించి మిషన్లు పంపిణీ చేశారు. సంస్థ మంచిర్యాల కార్యదర్శి కెరోలిన్ విగ్, ఫాస్టర్ పాల్ విగ్ తెలిపారు.

కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గంగాధర్, సర్పంచ్ సులోచన ఉన్నారు.

గోదారి జలాలు సరఫరా చేయాలి

తాండూర్: అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారంగా ఇంటింటికీ గోదారి జలాలు సరఫరా చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల దాసు, సీపీఐ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పోరు యాత్ర గురువారం మండలంలో మూడో రోజు కొనసాగింది. ఇందులో నాయకులు మామిడాల రాజేశం, లింగం రవి, దాగం మల్లేష్, సాలిగామ సంతోష్, జీసీ మాణిక్యం, ఉపేందర్, అందే పురుషోత్తం, మల్లయ్య, అక్కెపల్లి బాపు, భరత్ ఉన్నారు.

సమస్యల పరిష్కార వేదిక

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కార వేదిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు ఈశ్వరయ్య, అశోక్, కిషన్, భూమారెడ్డి పాల్గొన్నారు. భీమిని, కన్నెపల్లి, నెన్నెల, వేమనపల్లి మండలాల వినియోగదారులకు సమాచారం లేక నామమాత్రంగా వినియోగదారులు హాజరయ్యారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతి

మందమర్రిరూరల్: నాలుగేళ్ల ప్రొహిబిషన్ పీరియడ్ పూర్తయిన గ్రామ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని కోరుతూ మందమర్రిలోని నివాసంలో గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మికి గ్రామ పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందించారు. జూనియర్, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక కార్మెల్ హైస్కూల్‌లో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయులకు అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, ఎంఈవో పోచయ్య, సెక్టోరల్ అధికారి చౌదరి, పీఆర్‌టీయూ టీఎస్ గౌరవ అధ్యక్షురాలు శాంకరి, జిల్లా బాధ్యుడు రాసమల్ల రవి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

లక్సెట్టిపేట: మండలంలోని రోటరీ క్లబ్ ఆఫ్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, ఎస్సై లక్ష్మణ్, క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి మనోహర్, కోశాధికారి బోనగిరి కిషన్, కొత్త వెంకటేశ్వర్లు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నరేష్

కాసిపేట: గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఎస్సై నరేష్ పేర్కొన్నారు. గురువారం కన్నెపల్లి మండలంలోని రెబ్బెన గ్రామపంచాయతీలో ప్రజలతో ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. గుడుంబా, నిషేధిత వస్తువులను ఉపయోగించినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం ముత్తాపూర్ గ్రామ యువతకు క్రికెట్ కిట్లను అందజేశారు. భీమిని మండలంలోని బిట్టూర్‌పల్లి, అక్కళ్లపల్లి, రాజారాం గ్రామాల్లోని యువతకు క్రికెట్ కిట్లను భీమిని ఎస్సై మహేందర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ యువజన అధ్యక్షుడు మహేష్‌గౌడ్, పోలీసులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న అఫ్రోజ్‌ఖాన్

శ్రీరాంపూర్: భూగర్భ గనుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణ కల్పించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్కే 7 గనిపై కాంట్రాక్ట్ కార్మికులతో మాట్లాడారు. భూగర్భంలో ఫైర్ సీల్ వర్క్, మేషన్ వర్క్, చిప్పింగ్ వంటి పనుల్లో కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్నారని వీరికి రక్షణ పరికరాలు, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కిల్ పనులు చేయిస్తూ అన్‌స్కిల్డ్ వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. రెండు నెలలుగా కార్మికులు జీతాలు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ప్రతి నెల 10 లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులందరికి కోలిండియాలో ఇస్తున్నట్లుగా హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం గని యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గడ్డం దిలీప్‌కుమార్, కార్యదర్శిగా పెద్దపల్లి కార్తిక్, ప్రచార కార్యదర్శిగా మదన్మోహన్, కోశాధికారిగా కందుల వెంకటేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ మండల కార్యదర్శి దొడ్డిపట్ల రవిందర్, నాయకులు బూర వీరేశం, ఉపాధ్యక్షులు యస్ మల్లేశ్, ఫిట్ సెక్రెటరీ మారపల్లి సారయ్య, నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజలకు శక్తిమేరకు సేవ



రంజాన్ తోఫాను అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

మంచిర్యాలటౌన్: ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో తన తండ్రి కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టును స్థాపించి ఐదేళ్లుగా నిరుపేదలకు సేవలను అందిస్తున్నామని, శక్తి మేరకే అందించే సేవలను కొనసాగిస్తానని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం ముస్లిం మహిళలకు ట్రస్టు ద్వారా రంజాన్ తోఫా కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ చీరలు, క్రిస్మస్ కానుకలు, రంజాన్‌కు తోఫాలను తమ ట్రస్టు ద్వారా ప్రతి ఏటా అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో తాము ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, చిట్ల సత్యనారాయణ, పూదరి తిరుపతి, ఒడ్డె రాజమౌళి, కొండ చంద్రశేఖర్, తూముల నరేశ్, పెంట రజిత పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్లు అందజేత



వాలీబాల్ కిట్లు అందిస్తున్న ఎస్సై రాజశేఖర్

నెన్నెల: ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా గురువారం మండలంలోని చిన్నవెంకటాపూర్ గ్రామ యువకులకు ఎస్సై రాజశేఖర్ క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించాలన్నారు. అసాంఘిక శక్తుల గురించి ఎలాంటి సమాచారం తెలిసినా పోలీసులకు తెలియజేయాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల శారద, సహకార సంఘం చైర్మన్ మల్లేష్, పోలీసులు విజయ్, అనంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.